



# కరపత్రం

SINCE 2014

బుధవారం సెప్టెంబర్ 17 2025 | సంపుటి :0 | సంచిక :330 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## 16వేల మంది విదేశీయులను దేశం నుంచి బహిష్కరించనున్న కేంద్రం..!



దేశం నుంచి 16వేల మంది విదేశీయులను బహిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌లో ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త వలస చట్టాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నార్కోటిక్స్ రవాణా , ఇతర నేరాలతో సంబంధమున్న దాదాపు 16,000 మంది విదేశీయుల ను దేశంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పేజి 2లో ▶

## కూర్చున్నారేంటి? నిలబడి చప్పట్లు కొట్టండి: మోదీతో ర్యాలీలో నీతీశ్ వ్యాఖ్యలు వైరల్



ఎన్నికల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ బిహార్ లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా అక్కడి సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కూర్చున్న ప్రజలు లేచి ప్రధానికి కృతజ్ఞతలు తెలపాలని సూచించారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. పేజి 2లో ▶

## కృత్రిమ కాళ్ల అమరికకు ఆర్థికసాయం

### సిఎం రేవంత్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపిన యువకుడు



కృత్రిమ కాళ్లను అమర్చుకునేందుకు ఆర్థిక సాయం అందించి, మళ్లీ నడవగలిగేలా చేసినందుకు సిఎంకు ఓ యువకుడు కృతజ్ఞతలు తెలిపారు. హనుమకొండ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ని కలిశారు. ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ప్రోత్సాహకం అందించి మళ్లీ నడిచేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 2, 2024న రైలులో రాజస్థాన్ వెళ్తున్న రాహుల్‌ను కొందరు దుండగులు రైలు నుంచి కిందికి తోసేశారు. ఈ ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్‌కు సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ప్రభుత్వం సాయం చేసింది. అందుకు కృతజ్ఞతగా రాహుల్ తన కుటుంబంతో కలిసి వచ్చి మర్యాద పూర్వకంగా సీఎంను కలిశారు. తనను మళ్లీ నిలబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కటుఉంబ సభ్యులుకూడా సిఎం సాయం పట్ల అభినందనలు తెలిపారు.

## జిఎస్టీ రేట్ల తగ్గింపు ప్రజలకు చేరాలి

### ధరల వివరాలను వ్యాపారులు డిస్‌ప్లే చేయాలి ట్రేడర్స్ అసోసియేషన్లకు భట్టి సూచన



జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలందరికీ అందాలని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వస్తువులు, సేవల పన్ను రేట్ల సవరణ తర్వాత డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ట్రేడర్స్ అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జీఎస్టీ పన్నుల తగ్గింపు, దాని ప్రయోజనాలు ప్రజలకు ఎలా చేరాలనే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విధానపరమైన నిర్ణయాలు ఎన్ని తీసుకున్నా.. వాటి ప్రయోజనాలు సామాన్య ప్రజలకు అందాలని ఆయన అన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నప్పటికీ, ఈ నిర్ణయం ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే తీసుకున్నామని తెలిపారు. మధ్యతరగతి ప్రజలు, రైతులకు ఉపయోగపడే వస్తువులు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గించిన పేజి 2లో ▶

## ఆ బాధిత కుటుంబాల గుండెకోత కనిపించడం లేదా?: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కొనసాగుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో నాలాలో పడి కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలను మూడు రోజులు గడుస్తున్నా వెలికితీయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిన ఘటనలో ఆరుగురి మృతదేహాలను ఇప్పటికీ గుర్తించలేని అసమర్థత కాంగ్రెస్‌దేనన్నారు. కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత మానవత్వం లేని కాంగ్రెస్‌కు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. నాలాల్లో బలి చేసిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే భారత రాష్ట్ర సమితి చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## తితిదే ఆధ్వర్యంలో ఏపీ వ్యాప్తంగా 1000 ఆలయాల నిర్మాణం



తిరుమల: రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఆలయాలను నిర్మించాలని తితిదే ధర్మకర్తల మండలిలో నిర్ణయించారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 6 ఆలయాల వరకు నిర్మిస్తామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. మతమార్పిడుల కట్టడికి శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మిస్తామన్నారు. ప్రధానంగా శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపిన ఆయన.. పేజి 2లో ▶




హైదరాబాద్: వాతావరణ శాఖ తెలంగాణకు వర్ష సూచన చేసింది. ఈ రోజు(సెప్టెంబర్ 16), రేపు (సెప్టెంబర్ 17) పలు జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది. ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. తెలంగాణకు ఆనుకొని తూర్పు విదర్భ ప్రాంతంలో మరో ఉపరితల అవర్తనం కొనసాగుతున్న కారణంగా తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రోజు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. మిగిలిన అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలకు ఛాన్స్ ఉందని తెలిపింది. హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు, ఇంటెన్స్ స్పెల్ కారణంగా సాయంత్రం రాత్రి సమయంలో అక్కడక్కడ జోరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు (సెప్టెంబర్ 17) వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన చేసింది. హైదరాబాద్ సిటీలో వాతావరణం ఎలా ఉందంటే.. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఎండలు.. మధ్యాహ్నం 3 గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయి క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి వానలు కురుస్తున్న పరిస్థితి ఉంది. సెప్టెంబర్ నెలంతా ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కావడంతో పాటు.. వర్షపాతం కూడా అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## కేంద్ర మంత్రి ఫొటోతో సైబర్ మోసం..!



2లో ▶

## టార్గెట్ హరీశ్, సంతోష్ .. పన్నీరు వారి పాల దందా..హ్యాపీరావు ఘోరాలు..కవిత ట్వీట్లు వైరల్




ఇప్పటికే హరీశ్ రావు ,సంతోష్ రావులను టార్గెట్ చేసిన కవిత..ఇపుడు మరోసారి సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. కవితక్క అప్ డేట్స్ పేరుతో ఎక్స్ లో పోస్టులు పెడుతోంది కవిత టీం. టైం చెప్పి మరీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోంది కవిత టీం. పేజి 2లో ▶

# సంపాదకీయం

## చైనాతో భారత్ వ్యూహాత్మక చెలిమి

'అమెరికాతో శత్రుత్వం ప్రమాదకరం. అయితే, అమెరికాతో స్నేహం ప్రాణాంతకం' అని అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి, అంతర్జాతీయ రాజనీతిజ్ఞుడు హెన్రీ కిస్సింజర్ ఓ సందర్భంలో అన్నారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేసే వస్తువులపై ఆ దేశం 50 శాతం సుంకాలు విధించడాన్ని బట్టి అది నిజమని మరోసారి నిరూపితమైంది. భారతదేశానికి అమెరికా గొప్ప మిత్ర దేశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నో సందర్భాల్లో ప్రకటించారు. తనకు ట్రంప్ గొప్ప స్నేహితుడని, భారత్%-%అమెరికా మధ్య సంబంధాలు బలోపేతం కావడం తన ఘనతేనని కూడా చెప్పుకొన్నారు. అయితే, మోదీ అర్థం చేసుకోవాల్సిన వాస్తవం బోలెడుంది. అధ్యక్ష పీఠం మీద ఎవరు కూర్చున్నా అమెరికా అమెరికానే. ఆ దేశ విదేశాంగ విధానం దాని ప్రయోజనాల కేంద్రంగానే ఉంటుంది తప్ప, ప్రపంచం కోణం నుంచి కాదు.

ఈ మధ్య కాలంలో అమెరికా మనకు బాగా సన్నిహితమైందంటే దానికి కారణం చైనాయే. డ్రాగన్ దూకుడును నిలువరించడానికి అమెరికాకు భారత్ అవసరమైంది. భారతదేశంతో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా చైనా ప్రాబల్యాన్ని తగ్గించడానికి వీలవుతుందని అగ్రరాజ్యం భావించింది. అందులో భాగంగానే భారత్‌తో సత్సంబంధాలను పెంచుకున్నది. ఇది గుర్తించని మన ప్రధానమంత్రి అమెరికాలో ట్రంప్‌కు మద్దతుగా 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇది భారత విదేశాంగ విధానంలో ఊహించని మార్పు.

ఇక చైనా విషయాన్నే చూద్దాం. నా ఇటీవలి పర్యటనలో మౌలిక సదుపాయాల కల్పనలో చైనా ప్రగతిని చూస్తే ఆశ్చర్యమనిపించిది. మూడు దశాబ్దాల్లోనే చైనా పేద దేశం నుంచి ప్రపంచ పారిశ్రామిక పవర్‌హౌజ్‌గా ఎదిగింది. మరే దేశంతోనూ సంబంధం లేకుండానే డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించింది. మనం వాడే గూగుల్, జీమెయిల్, గూగుల్ మ్యాప్స్, పేమెంట్ వ్యవస్థలను కాకుండా చైనా తమ ప్రజల కోసం ప్రత్యేక యాప్‌లను సొంతంగా తయారు చేసుకున్నది. ప్రపంచానికి కావలసిన అరుదైన ఖనిజాలన్నీ చైనా నుంచే ఎగుమతి అవుతున్నాయి. కంప్యూటర్లలో వాడే మైక్రోచిప్‌ల తయారీలో ఇవి కీలకం. సాంకేతికత, సమాచార భద్రత, బ్యాంకింగ్ కార్యకలాపాలు ఇలా అన్నిరకాల సేవలకు మైక్రోచిప్‌లు కావాల్సిందే. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ ఈ చిప్‌లపై ఆధారపడబోతున్నాయి. ఈ అంశంలో చైనాకు అరుదైన ఖనిజాల రూపంలో ప్రకృతి వరం ప్రసాదించింది.

రష్యా %-% ఉక్రెయిన్ యుద్ధం భారత్ %-% అమెరికా సంబంధాలకు, మోదీ %-% ట్రంప్‌ల స్నేహానికి పరీక్షగా నిలిచింది. వాస్తవానికి అమెరికా కంటే రష్యా దౌత్యపరంగా భారత్‌కు ఎంతో కీలక దేశం. రక్షణ అవసరాలపరంగా రష్యాపైనే భారత్ ఎక్కువగా ఆధారపడుతున్నది. ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో, భారత్‌కు వ్యతిరేకంగా ఐరాసలో జరిగిన చర్చల్లో, ఓటింగ్ సమయాల్లో రష్యా మనకు మద్దతుగా నిలిచింది. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంతో పశ్చిమ దేశాలన్నీ రష్యాపై ఆంక్షలు విధించాయి. ఆ ఆంక్షలను కూడా దాటుకొని భారత్ రష్యా వద్ద చమురు కొంటున్నది. ఇది ట్రంప్ ఆగ్రహానికి కారణమై, భారత్‌పై సుంకాలతో విరుచుకుపడుతున్నారు.

నెహ్రూ కాలం నుంచి పీవీ నరసింహారావు హయాం వరకు భారత్ అన్ని దేశాలతో సమదూరం (అలీన విధానం) పాటించింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఓ వైపు అమెరికా కూటమి, మరోవైపు సోవియట్ కూటమి ఉన్న సమయంలోనూ భారత్ సమదూరం పాటించింది. టెక్నాలజీ అంతగా లేని కాలంలో ఈ విధానం బాగానే పనిచేసింది. కానీ, ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నది. ఆహార పదార్థాలు, చమురు, వాణిజ్య అవసరాల కోసం ఒక దేశంపై మరో దేశం ఆధారపడక తప్పని పరిస్థితి. మరోవైపు, అమెరికా కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ పవర్ సెంటర్ క్రమంగా మారుతున్నది. ఆసియాలో చైనా శక్తిమంతంగా మారి అమెరికాకు సవాలు విసురుతున్నది. పశ్చిమ దేశాల్లోనూ అంతర్గత విభేదాలు బయటపడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా తన విదేశాంగ విధానాన్ని క్రమంగా మార్చుకుంటూ వచ్చింది. అలీన విధానం (నాన్ అలైన్‌మెంట్) నుంచి అన్ని దేశాలతో 'సత్సంబంధాలు' (మల్టీ అలైన్‌మెంట్) అనే విధానాన్ని ఎంచుకున్నది. అందుకే ఏక కాలంలో అమెరికా, చైనా, రష్యా దేశాలతో సంబంధాలు కొనసాగించింది. 2020 వరకు ఇది బాగానే సాగింది. ఆ ఏడాది జరిగిన గల్వాన్ ఘర్షణ తర్వాత పరిస్థితులు మారిపోయాయి.

గల్వాన్ ఘర్షణతో భారత్, చైనా మధ్య దూరం పెరిగింది. అమెరికాకు ఇండియా మరింత దగ్గరైంది. అయితే, విదేశాంగ విధానం కంటే ట్రంప్%-%మోదీ స్నేహం ఎక్కువగా వార్తల్లో నిలిచింది. అదే సమయంలో భారత్‌ను అమెరికా వ్యూహాత్మకంగా చైనా వ్యతిరేక కూటములు, చర్యల్లో భాగస్వామిని చేయడం ప్రారంభించింది. గల్వాన్ ఘర్షణ నేపథ్యంలో దేశీయంగానూ మోదీకి పెద్దగా వ్యతిరేకత ఎదురవ్వలేదు. కానీ, ఇజ్రాయెల్%-%గాజా, రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధాలతో అంతర్జాతీయ సమీకరణాలు మారిపోయాయి. ఈ యుద్ధాల్లో భాగస్వాములైన అన్ని దేశాలతో సత్సంబంధాలు కలిగిన భారతదేశం ప్రస్తుతం నిర్ణాయక కూడలిలో నిలబడింది. ఈ సందర్భంలో భారత్ వ్యూహాత్మకంగా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించాలి. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాలు తీసుకోవాలి. మిత్ర దేశాల (అమెరికా) ఒత్తిడికి తలొగ్గవద్దు.ప్రస్తుతం ప్రపంచం మల్టీ పోలార్ వరల్డ్‌గా మారుతున్నది. మరోవైపు, సైబర్ ముప్పు పెరుగుతున్నది. ఏఐ, అంతరిక్షంలో పోటీతత్వం మొదలైంది. సార్వభౌమత్వ పరిధి అనేది భౌగోళిక సరిహద్దులను మించిపోయింది. సముద్ర జలాలపై ఆధిపత్యం, సమాచార, సాంకేతిక సార్వభౌమత్వం, సప్లయ్ చైన్ సెక్యూరిటీ ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలకు అత్యంత కీలకంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో సరిహద్దు వివాదాల కారణంగా చైనాను దూరం చేసుకోవడం భారత్‌కు శ్రేయస్కరం కాదు. చర్చల ద్వారా సరిహద్దు సమస్యలను పరిష్కరించుకుంటూనే చైనాతో వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకోవాలి. అంతేకాకుండా మోదీ ప్రచారం చేస్తున్న ఆత్మనిర్భరతను ఆచరణలో వేగవంతం చేయాలి. ఆర్థికంగా బలపడినప్పుడే సార్వభౌమత్వం సాధ్యపడుతుంది. వాస్తవానికి అమెరికాకు చైనానే గట్టి పోటీదారు. కానీ, మిత్రదేశమైన ఇండియాపైన విధించిన సుంకాలను ట్రంప్ చైనాపై విధించే సాహసం చేయలేకపోయారు. దీనికి కారణం, చైనా ఆర్థిక వ్యవస్థ పరిమాణం, ప్రపంచ సప్లయ్ చైన్‌లో దాని వాటా. దీన్ని మనం గమనించాలి. చైనాతో సత్సంబంధాలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను మోదీ ఆలస్యంగానైనా గుర్తించినట్టున్నారు. ట్రంప్ సుంకాల హూంకరింపుల వేళ ఆయన చైనాకు వెళ్లి ఎస్సీవో సదస్సులో పాల్గొన్నారు. తద్వారా, అమెరికా ఒత్తిడికి తలొగ్గబోమన్న సంకేతం ఇచ్చారు. ఇది భారత విదేశాంగ విధానంలో కీలక మలుపు. ఈ స్వయం నిర్ణయాధికారాన్ని మోదీ అలాగే కొనసాగించాలి. అలా కాకుండా, 'మీరు మమ్మల్ని దూరం చేసుకుంటే మేం చైనాకు దగ్గరవుతాం' అని సందేశం ఇవ్వకూడదు.

చైనాతో భారత్ నిజమైన, పరస్పర విశ్వాసం పెంపొందేలా స్నేహ సంబంధాలు కొనసాగించాలి.'మన మిత్రులను మనం ఎంచుకోవచ్చు. కానీ, మన పొరుగున ఎవరుండాలన్నది మనం నిర్ణయించలేం. వారిని మార్చలేం' అని వాజపేయి అనేవారు. చైనా మన పొరుగు, శక్తిమంతమైన దేశమన్న సంగతి ఎప్పుడూ మర్చిపోకూడదు. ఎన్ని విభేదాలున్నా దాన్ని విస్మరించలేమన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని విదేశాంగ విధానాన్ని రూపొందించుకోవాలి. చైనాతో ద్వైపాక్షిక సంబంధాల పెంపు కోసం రెండు దేశాల్లోని ప్రధాన నగరాల మధ్య నేరుగా విమాన సర్వీసులను నడిపించాలి. రెండు దేశాల పౌరులకు ప్రత్యేకమైన వీసా సౌకర్యాలు కల్పించాలి. భారతీయ విద్యార్థులకు చైనాలో మెరుగైన అవకాశాలు లభించేలా మాండరిన్ భాష నేర్పించాలి. చైనా సంస్థలతో వ్యాపార సంబంధాలు పెరగాలి. ఈ క్రమంలో న్యాయపరమైన సవాళ్లు ఎదురైతే పరిష్కరించుకోవడానికి భారతదేశంలోని న్యాయసంస్థలు చైనా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి. భారత విద్యార్థులు చైనాలోని విద్యాసంస్థలను, చైనా విద్యార్థులు భారత విద్యాసంస్థలను సందర్శించేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా రెండు దేశాల సంస్కృతులపై నవతరానికి అవగాహన వస్తుంది. ఇది ద్వైపాక్షిక సంబంధాల్లో ఎంతో దోహదం చేస్తుంది. ఈ కార్యక్రమాలను చేపడుతూనే జాతీయ నాయకత్వం బ్రిక్స్, ఎస్సీవో లాంటి సదస్సుల్లో తరచుగా పాల్గొని భారత్ గొంతుకను వినిపించాలి.

## కేంద్ర మంత్రి ఫొటోతో సైబర్ మోసం..!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటో పెట్టి ఓ వృద్ధుడిని మోసం చేశారు సైబర్ నేరగాళ్లు. హైదరాబాద్‌కు చెందిన 68 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.14.35 లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. 'పెట్టుబడి పెట్టండి అధిక లాభాలు' వస్తాయంటూ ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టుకు సంతోష్‌నగర్‌కు చెందిన బాధితుడు ఆకర్షితుడయ్యారు. కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ఫొటో ఉండటంతో నమ్మి.. లింక్ క్లిక్ చేశాడు. తొలుత మెటల్ ట్రేడింగ్లో రూ.12,600 పెట్టుబడి పెట్టిన బాధితుడు.. లాభాలు చూపించడంతో విడతలవారీగా రూ.14.35 లక్షలు పెట్టుబడి పెట్టాడు. లాభాలు ఇవ్వకపోగా.. మరో రూ.8 లక్షలు కడితే మొత్తం డబ్బు రిలీజ్ చేస్తామని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

# జిఎస్టీ రేట్ల తగ్గింపు ప్రజలకు చేరాలి

మొదటిపేజీ తరువాయి

వస్తువుల ధరల వివరాలను వ్యాపారులు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. షోరూమ్‌ల ముందు కచ్చితంగా రేట్ల ధర పట్టికలు పెట్టాలని.. అప్పుడే, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయంపై అవగాహన వస్తుందని ఆయన కోరారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఏ అంశంపైన అయినా చర్చించడానికి సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. వ్యాపారస్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, తక్షణమే స్పందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో వ్యాపారులు కలిసి పనిచేసి జీఎస్టీ సవరణ ప్రయోజనాలను ప్రజలకు చేర్చాలని ఆయన కోరారు.

## మెట్రో సెక్యూరిటి గార్డులుగా ట్రాన్స్‌జెండర్లు






మొదటిపేజీ తరువాయి

### 20మందికి నియామక పత్రాలు అందచేత

హైదరాబాద్ మెట్రో లో 20 మంది ట్రాన్స్‌జెండర్లను తెలంగాణ ప్రభుత్వం సెక్యూరిటీ గార్డులుగా నియమించింది.. ఈ క్రమంలో మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ- గార్డులుగా నియమిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు. సెక్యూరిటీ- గార్డు నియామకాల కోసం దాదాపు 300 నుంచి 400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి, వారు ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని.. ఈ నేపథ్యంలోనే వీరిని నియమించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. వారు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇతర ట్రాన్స్‌జెండర్లకు కూడా ఆదర్శంగా నిలవాలని చెప్పుకొచ్చారు. వీరు ఈ సమాజానికి ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

## అంగప్రదక్షిణం టోకెన్ల కేటాయింపులో మార్పు




తిరుమల: అంగప్రదక్షిణ టోకెన్ల కేటాయింపు విధానంలో తితిదే మార్పు తీసుకొచ్చింది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న FIFO (First In First Out) స్థానంలో.. లక్కీ డిప్ విధానాన్ని అమలు చేయనున్నారు. టోకెన్లు 3 నెలల ముందుగానే ఆన్‌లైన్‌లో లక్కీడిప్ సిస్టమ్ ద్వారా విడుదలవుతాయి.

డిసెంబరు నెలకు సంబంధించిన అంగ ప్రదక్షిణ టోకెన్ల కోసం సెప్టెంబరు 18 నుంచి 20వ తేదీ వరకు లక్కీడిప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. లక్కీడిప్ ద్వారా ఎంపికైన భక్తులకు ఈ టోకెన్లు కేటాయిస్తారు. శుక్రవారాలు మినహా ప్రతిరోజు 750 టోకెన్లు, శనివారాల్లో 500 టోకెన్లు జారీ చేయనున్నట్టు తితిదే తెలిపింది. భక్తులు తిరిగి ఈ సేవ పొందేందుకు గడువు 90 రోజులకు బదులు 180 రోజులుగా నిర్ణయించారు. ఈ మార్పును గమనించి అంగప్రదక్షిణ టోకెన్లు బుక్ చేసుకోవాలని భక్తులకు తితిదే అధికారులు విజ్ఞప్తి చేశారు.

## 16వేల మంది విదేశీయులను దేశం నుంచి బహిష్కరించనున్న కేంద్రం..!

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారందరినీ దేశం నుంచి బహిష్కరించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పలు జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి.

ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా నివాసముంటున్న విదేశీయులకుకఠిన శిక్షలు విధించే కొత్త చట్టం సెప్టెంబర్ 2న అమల్లోకి వచ్చింది. వలసలు, విదేశీయుల చట్టం-2025గా వ్యవహరిస్తున్న దీనిని బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదించగా.. ఏప్రిల్ 4న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. నాలుగు పాత చట్టాల స్థానంలో ఇది అమల్లోకి వచ్చింది. ఇందులోభాగంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దేశంలోకి ప్రవేశించిన విదేశీయులకు కనిష్టంగా రెండేళ్లు, గరిష్ఠంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష.. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

మహిళా అధికారి ఇంట్లో నోట్ల కట్టలు.. బంగారు ఆభరణాలు

నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా.. భారత్ లో పేదరికంలో మగ్గుతున్నవారు కోట్లాది మంది ఉన్నారు. పేదరికాన్ని అంతం చేయడానికి ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. అయితే ఈ సమస్య పరిష్కారంలో అక్రమ వలసలు ప్రధాన అడ్డుగోడగా నిలుస్తున్నాయి. సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా ప్రవేశించిన విదేశీయులు చట్టవిరుద్ధంగా ఉండడమే కాకుండా అసలైన లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమఫలాలను వీరు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన వలసలు, విదేశీయుల చట్టం ద్వారా వారిని దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది.

# కూర్చున్నారేంటి? నిలబడి చప్పట్లు కొట్టండి:

మొదటిపేజీ తరువాయి

పూర్ణియాలో జరిగిన బహిరంగ సభలో నీతీశ్ మాట్లాడారు. చివరిగా.. 'నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నా. మోదీ బిహార్ కోసం చాలా చేశారు. అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఇంకా ఎందుకు కూర్చున్నారు?. మీరు లేచి నిలబడి ఆయనకు ధన్యవాదాలు తెలపండి' అని ప్రజలకు సూచించారు. ఈక్రమంలోనే అక్కడ ఉన్న మహిళలు లేచి ప్రధానికి స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. అనంతరం మోదీ కూడా వారికి నమస్కారం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయన మద్దతుతో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కొద్దిరోజుల పాటు ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమిలో ఉన్నందుకు చింతిస్తున్నానని వ్యాఖ్యానించారు. ఇకపై ఎప్పటికీ ఎన్డీయేలోనే కొనసాగుతానని మోదీకి మాట ఇచ్చారు. నీతీశ్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

బీడీలతో ముడిపెట్టడం బిహారీలకు అవమానం

కాగా.. ఇదే సభలో మోదీ మాట్లాడుతూ ఆర్జేడీ- కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. బిహార్ ప్రజలను బీడీలతో పోల్చి వారిని అవమానించారని మండిపడ్డారు. గతంలో ఇక్కడ ఆర్జేడీ-కాంగ్రెస్ దుష్పరిపాలన సాగించాయన్నారు. ఓట్ల కోసం రాష్ట్రంలో విదేశీ చొరబాటుదారులకు కొమ్ముకాశాయని ఆరోపించారు.

## టార్గెట్ హరీశ్, సంతోష్ .. పన్నీరు వారి పాల దందా..హ్యాపీరావు ఘోరాలు..కవిత ట్వీట్లు వైరల్

మొదటిపేజీ తరువాయి

అక్రమాల టానిక్..పన్నీరు వారి పాల దందా ముచ్చట అంటూ ఎక్స్ లో స్టోరీ పోస్ట్ షేర్ చేశారు కవితక్క టీం. అన్నయ్య కలిపిన అనుబంధం టానిక్, దళితుల్ని ముంచిన పాలు అంటూ ట్యాగ్ లైన్ పెట్టారు. నేరెళ్ల నేరాలు..హ్యాపీ రావు ఘోరాలంటూ సెటైర్లు వేశారు. కొంపలో కుంపటి పెట్టిన హ్యాపీ రావు అంటూ సంతోష్ రావును టార్గెట్ చేశారు కవిత. ఆమె పోస్టులు పొలిటికల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఇటీవలే హరీశ్,సంతోష్ రావులపై తీవ్ర ఆరోపణలు చేసిన కవిత,బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామాచేసిన సంగతి తెలిసిందే.. ఇన్ని రోజులు సైలెంట్ గా ఉన్న కవిత..ఇపుడు మరోసారి హరీశ్,సంతోష్ లను టార్గెట్ చేయడంపై చర్చనీయాంశంగా మారింది.

అవినీతి అనకొండలు

బీఆర్ఎస్ పార్టీలో హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి అనకొండలు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కేసీఆర్ ప్రస్తుత దుస్థితికి హరీశ్‌రావు, సంతోష్‌రావుతోపాటు మేఘా కృష్ణారెడ్డి కారణమని ఆరోపించారు. వాళ్ల వల్లే కేసీఆర్‌కు అవినీతి మరకలు అంటాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పేరు చెప్పుకొని వారు లబ్ధి పొందారని, వాళ్ల వల్లే కేసీఆర్ బద్నాం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. "అయినా వాళ్లనే మోస్తాం.. వాళ్లకే ఇస్తాం" అంటే పార్టీ ఎట్లా ముందుకు పోతుందని ప్రశ్నించారు. ఒక బిడ్డగా తనకు చాలా బాధగా ఉందని తెలిపారు. ఐదేండ్లు ఇరిగేషన్ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? అని అడిగారు. అందుకే రెండో టర్మ్ లో హరీశ్‌రావును మంత్రి పదవినుంచి కేసీఆర్ తప్పించారని కామెంట్ చేశారు కవిత.

## తితిదే ఆధ్వర్యంలో ఏపీ వ్యాప్తంగా 1000 ఆలయాల నిర్మాణం

మొదటిపేజీ తరువాయి



తొలిసారిగా బ్రహ్మోత్సవాలను ఇస్రో పరిశీలించబోతున్నట్లు చెప్పారు. "ఈనెల 23న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 24 నుంచి అక్టోబరు 2 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 24న మీనలగ్నంలో ధ్వజారోహణం, అనంతరం సీఎం చంద్రబాబు దంపతులు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. పది రోజులపాటు సిఫార్సు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయబోతున్నాం. ఈనెల 28న శ్రీవారి గరుడసేవకు 3 లక్షల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నాం. చిన్నపిల్లలు తప్పిపోకుండా జియో ట్యాగింగ్ విధానం అమలు చేయబోతున్నాం" అని బీఆర్ నాయుడు తెలిపారు. అంతకుముందు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులతో కలిపి శ్రీవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్-2025ని బీఆర్ నాయుడు విడుదల చేశారు.

# తమ ఇల్లు కూలిస్తే చస్తాం

## - పెట్రోల్ పోసుకున్న యువకుడు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ సర్వే నెం 199 వీకర్ సెక్షన్ కాలనీలో రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరిట పేదల ఇండ్లను కూల్చివేయడంతో ఉద్రిక్తత నెలకొంది. గత 25 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు ఈ రేకుల ఇల్లే జీవనాధారమని, ఆటో నడుపుతూ, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని బాధితులు తెలిపారు. తమ ఇళ్లను కూల్చవద్దని కోరుతూ, బాధితురాలు ఇశ్రత్ బేగం, మొహమ్మద్ గౌస్ ల కుమారుడు షానవాజ్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తామని హెచ్చరించారు.

# కండ్లకోయ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కండ్లకోయ ఆక్సిజన్ పార్కు ముందు మంగళవారం రోజు మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.మేడ్చల్ మెడిసిటీ కళాశాలలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని 20 సంవత్సరాల వయస్సు గల ఇస్లావత్ అనూష, తన స్నేహితుడు మహేశ్వర్ రెడ్డితో కలిసి AP 28 CH 9386 ఫ్యాషన్ బైక్ వాహనంపై పయనిస్తుండగా, ఆక్సిజన్ పార్క్ బస్ స్టాప్ సమీపంలో వెనక నుండి వేగంగా వస్తున్న MP 28 H 3645 నంబర్ గల లారీ ద్విచక్ర వాహనాన్ని వెనక నుండి ఢీకొట్టింది. దీనితో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న అనూష లారీ కింద పడిపోయింది. అనుష అక్కడికక్కడే మృతిచెందగా. తీవ్ర గాయాల పాలైన మహేశ్వర్ రెడ్డిని చికిత్స కోసం మేడ్చల్ పట్టణంలోని సంప్రద ఆస్పత్రి కి తరలించారు.చికిత్స పొందుతూ మహేశ్వర్ రెడ్డి సైతం ప్రాణాలు కోల్పోయాడు ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు లారీని నిర్లక్ష్యంగా ప్రమాద కరంగా నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని మేడ్చల్ పోలీసులు చెప్పారు.ఈ ప్రమాదం విషయమై మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.అనూష వరంగల్ వాసిగా గుర్తించారు. మహేశ్వర్ రెడ్డి కి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# స్కాలర్ షిప్ ల కోసం విద్యార్థుల నిరసన

## - నిధుల విడుదల డిమాండ్

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి జ్ఞానోదయ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు, అధ్యాపకులు నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. సకాలంలో స్కాలర్‌షిప్ మంజూరు చేయాలని, లేని యెడల రాష్ట్రవ్యాప్త బందుకు మద్దతు ఇస్తామని కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్పు రాకపోవడంతో విద్యార్థులకు, కళాశాల యాజమాన్యానికి ఇబ్బందిగా ఉందని, వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చేపలు పట్టడానికి వెళ్లి వల్లపు హనుమయ్య అనే యువకుడు నల్లకుంట చెరువు కాలువలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. జవహర్ నగర్ కు చెందిన హనుమయ్య, స్నేహితులతో కలిసి చేపలు పట్టడానికి వెళ్ళినప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. మృతుని తమ్ముడు శివకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మున్సబ్ మెజిస్ట్రేట్ కం జూనియర్ సివిల్ జడ్జి కోర్టును నెలకొల్పాలని వినతి

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 16**
హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు గారిని జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన న్యాయవాదులు కలసి జమ్మికుంట, ఇల్లంతకుంట, వీణవంక మండలాలను కలుపుకొని జమ్మికుంటలో ప్రథమ శ్రేణి జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు మరియు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని, ప్రణవ్ బాబు ద్వారా ప్రభుత్వానికి మెమోరాండం ఇవ్వడం జరిగింది. దీనికి ప్రమాదం స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి జమ్మికుంటలో కోర్టు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని న్యాయవాదుల అందరికీ నమ్మకం ఇవ్వడం జరిగింది. అందరూ సమావేశం నిర్వహించి.





జమ్మికుంటలో మున్సబ్ మెజిస్ట్రేట్ కం జూనియర్ సివిల్ జడ్జి కోర్టును నెలకొల్పాలని ఉమ్మడిగా 30 మంది న్యాయవాదులు కలిసి మెమోడల్ ఇవ్వడం జరిగింది. ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగింది. . ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మోలుగూరి సదయ్య, ఏ బూసి లింగారెడ్డి, పొట్లపల్లి శ్రీధర్ బాబు, నక్క సత్యనారాయణ, , మొలుగూరి సదయ్య, హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నూతల శ్రీనివాస్, కనకం తిరుపతి, ముంజల విజయ్ , పింగిలి రమేష్ , సుకన్య, శ్రీరామ్ శిరీష, అబ్బరవేణి రాజు, వంశీకృష్ణ గూడెపు, అప్పని రాజు, పిట్టల రాజేష్, ముంజాల విజయ్, మోరే కళ్యాణ్, గుండ వరప్రసాద్, నవీన్ కుమార్, మారపల్లి శ్రీధర్, దూడపాక శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్‌లో రోడ్ల శుభ్రత పనులు



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బోడుప్పల్ డివిజన్‌లో భారీ వర్షం కారణంగా రోడ్లు జలమయం కావడంతో, మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ మున్సిపల్ సిబ్బందితో కలిసి స్వయంగా పర్యటించారు. మ్యాన్‌హోల్స్ వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి, వర్షపు నీరు సాఫీగా పోయేలా శుభ్రత పనులు చేపట్టారు. ఈ చర్యల వల్ల కాలనీల్లో నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు.

# మెట్ పల్లిలో సీనియర్ ఇంజనీర్లకు సన్మానం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో మంగళవారం ఇంజనీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ ఇంజనీర్లు గుంటుక గౌతమ్, శ్యామ్ గార్లను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ముల శ్రీనివాసరావు ఈ సన్మానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ముల శ్రీనివాసరావు, క్యాషియర్ వేములవాడ చంద్రశేఖర్, లయన్స్ కొండపల్లి రేణుక, పులి శెట్టి రాకేష్, ఆల్రౌండర్ గంగాధర్, మరియు ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు..

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 16**

- సైదాపూర్ క్రాస్ రోడ్ లో తాత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రణవ్.
- సింగాపురం నుండి ఢిల్లీ దాకా ఎదిగిన రైతు బిడ్డ.
- రాజ్యసభ సభ్యుడిగా హుజురాబాద్ ప్రాంతానికి ఎనలేని సేవలు.
- జయంతి వేడుకలకు భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు.

హుజురాబాద్ ప్రాంత బిడ్డగా ఈ ప్రాంత అభివృద్ధికి ముఖ్యంగా త్రాగునీటికి,విద్య పరంగా అనేక సేవలు రాజేశ్వర్ రావు అందజేశారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ అన్నారు.మంగళవారం నాడు మాజీ రాజ్యసభ సభ్యులు



స్వర్గీయ వొడితల(సింగాపురం) రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు హుజురాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.సైదాపూర్ క్రాస్ రోడ్ లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జయంతి సందర్భంగా వివిధ మండలాల



నుండి వచ్చిన కాంగ్రెస్ నాయకులు,అభిమానులను ఆప్యాయంగా పలకరించారు ప్రణవ్.ఈ సందర్భంగా ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.తాత ఆశయాలను కొనసాగిస్తూ,విద్య ఉద్యోగ కల్పనలో మొదటి స్థానంలో ఉంచుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో

## - కమ్యూనిస్టులదే కీలక పాత్ర



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో మంగళవారం సిపిఐ మండల కార్యదర్శి ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నాయకత్వం వహించారని అన్నారు. తెలంగాణ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద అమరవీరులకు సిపిఐ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అమరవీరుల చిత్రపటాలకు ఎండి ఉస్మాన్ తో పాటు మున్సిపల్ కార్మికులు విప్లవ జోహార్లు అర్పించారు. భూస్వాములకు, రజాకారులకు ఎదురొడ్డి పోరాడిన కమ్యూనిస్టుల చరిత్ర ప్రతి ఒక్కరికీ తెలుసునని ఆయన పేర్కొన్నారు.

# సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఒడితల రాజేశ్వరరావు జన్మదిన వేడుకలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 16**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ని సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో , మాజీ రాజ్యసభ సభ్యులు కీర్తిశేషులు ఒడితల రాజేశ్వరరావు జయంతి సందర్భంగా సాయి మానసిక దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక పాఠశాలలో ఆటోనగర్ ప్రెసిడెంట్ పరంకుశం కృష్ణ స్వామి, జయశ్రీ దంపతుల ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న దివ్యాంగ విద్యార్థులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పరంకుశం కృష్ణస్వామి మాట్లాడుతూ, పెద్దలు ఒడితల రాజేశ్వరరావు ఉన్నప్పుడు ఎంతోమంది అనాధలకు, అభాగ్యులకు,దివ్యంగులకు చేయూతనందించారని, వారి కుమారుడు ఒడితల శ్రీనివాసరావు ,వారి



మనుమడు ప్రణయ్ బాబు కూడా ఇదే బాటలో పయనిస్తున్నారని ఆయన అన్నారు.వారు ఎక్కడున్నా కూడా వారి ఆత్మ ఆ పరమాత్ముని సన్నిధిలో ప్రశాంతంగా ఉండాలని, వారి కుటుంబ సభ్యులందరూ ఈ ఆశ్రమంలో ఉన్న దివ్యంగ



విద్యార్థులందరికీ చేదోడువాదోడుగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ , కొత్తపెల్లి కొమరన్న , రామలింగ చారి , ఆశ్రమ వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చి రాములు , పేరెంట్స్ కమిటీ ట్రెజరర్ శాంతా దేవి పాఠశాల సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు

# శరన్నవరాత్రోత్సవ కరపత్రం ఆవిష్కరణ

## - కోరుట్ల త్రిశక్తి ఆలయ సేవా సమితి



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కోరుట్ల పట్టణంలో గణేశ నవదుర్గా మండలి, త్రిశక్తి ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రోత్సవ కరపత్రం ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు 22-09-2025న ప్రారంభమై 02-10-2025న ముగుస్తాయి. పంచమి బోనాలు 26-09-2025న, లక్ష గాజుల అర్చన శనివారం, సామూహిక అక్షరాభ్యాసం సోమవారం, చండి హవనం, లక్ష పుష్పార్చన, అన్నదానం దుర్గాష్టమి సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వేములవాడ- సిరికొండ రోడ్డు నిర్మాణానికి రూ.23 కోట్లు

## - రోడ్డు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
## - ముఖ్యమంత్రి, కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఆది

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ నియోజకవర్గంలో వేములవాడ-సిరికొండ రోడ్డు నిర్మాణానికి సిఆర్ఐఎఫ్ ద్వారా 23 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



నియోజకవర్గంలో పలు రోడ్లు,బ్రిడ్జీల నిర్మాణానికి నిధులు కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా ఇటీవల ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణకు నిధులు మంజూరు చేయవలసిందిగా కోరడంతో సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి వేములవాడ-సిరికొండ రోడ్డు సుమారు 18 కిలోమీటర్ల మేర, వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామ శివారు 10 కిలోమీటర్ల నుండి కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, భూక్య రెడ్డి తండా మీదుగా ఆజ్మీరా తండా శివారు సుమారు 18 కిలోమీటర్ల వరకు 23 కోట్ల కేంద్ర రహదారుల మౌలిక సదుపాయల నిధి (సీఆర్ఐఎఫ్) నిధులు మంజూరు కావడం జరిగిందని,ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేంద్రమంత్రికి, కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున అది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని జన్మదినం సందర్భంగా బీజేపీ సేవా కార్యక్రమాలు

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), సెప్టెంబర్ 16:**
భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు 15 రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బిజేపి రామగుండం ఇన్చార్జీ కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హన్మంతు గౌడ్ తెలిపారు. సేవా పక్వాడ్ నియోజక వర్గ కన్వీనర్ కొండపర్తి సంజీవ్ ఎన్టీపీసీలో బిజేపి పార్టీ మండల అధ్యక్షులతో కలిసి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బిజేపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హన్మంతు గౌడ్ ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ.. 15 రోజుల పాటు అన్ని మండల కేంద్రాలలో వివిధ రూపాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈక్రమంలో బుధవారం అన్ని మండల కేంద్రాలలో రక్త దాన శిబిరాలు నిర్వహించి 75 యూనిట్ల కి తగ్గకుండా



చూసుకోవాలన్నారు. 18న ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై, మహిళా మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో చిత్రలేఖనం, శక్తి కేంద్రం, మండల కేంద్రంలో ముఖ్యమైన స్థానాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. స్వచ్ఛభారత్ చేయడానికి ముందు పరిసరాల ఫోటో, స్వచ్ఛభారత్ నిర్వహించిన తర్వాత పరిసరాల ఫోటో, చిన్న వీడియోలు తీయాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక సెలబ్రెటీలను ఆహ్వానించాలని సూచించారు. 21న నమో మారథాన్.. యువమోర్చాల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో 2-3 కి.మీ నిర్వహించాలని, యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. 25న బూత్ స్థాయిలో మొక్కలు నాటడం, దీనదయాళ్ జీకి నివాళులు అర్పించడం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో మేధావులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగాలు ఇప్పించాలని డాక్యుమెంటరీ ప్రదర్శన, ఖాదీ స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 27న దివ్యాంగులకు సన్మానం, దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయాలన్నారు. 28న విశిష్ట(పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషనూ, అర్జున అవార్డ్ లు పొందిన) వ్యక్తులకు సన్మానం, అక్టోబర్ 2న మహాత్మా గాంధీజీకి నివాళులు- లాల్ బహదూర్ శాస్త్రీ చిత్రాలకు పుష్పాంజలి, ఖాదీ ఉత్పత్తుల కొనుగోలు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజేపి మండల అధ్యక్షులు బోడకుంటి సుభాష్, మేర్గు నరేష్, ఊరగొండ అపర్ణ మాజీ మండల అధ్యక్షులు కోడూరి రమేష్, నాయకులు దండు పవన్ సాయి, కొల్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు,జరిమానా

- జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష తప్పదు
- శిక్షలతోనే సమాజంలో మార్పు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
హత్య కేసులో నిందుతుడికి జీవిత ఖైదు, 1000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. జూలపెల్లి మండలం తెలీకుంటకు చెందిన మరిపెల్లి రాజయ్య (64) అనే వ్యక్తి వేములవాడ శివారులోని మామిడితోటలో తోటకాపరిగా పని చేసుకుంటున్నాడు, అతనితో పాటు మంత్రి ఆనందం చింతల్ ఠాణా తోటలో తోటకాపరిగా పనిచేస్తున్నాడు, పని విషయంలో రాజయ్య ఆనందం మధ్య ఎప్పుడు గొడవ జరిగేది, ఇట్టి



విషయంలో రాజయ్య ఆనందంను తిట్టేవాడు, రాజయ్య తిడుతున్న విషయం ఆనందం మనసులో పెట్టుకొని రాజయ్యను చంపాలనే ఉద్దేశ్యంతో 2024 ఏప్రిల్ 29న రాత్రి రాజయ్య రూమ్ బయట తింటున్న సమయంలో ఆనందం ఇనుపపారాతో రాజయ్య తల పై కొట్టి చంపాడు. ఈ కేసులో రాజయ్య కొడుకు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడు రిమాండ్ కు పంపి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడం జరిగింది. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ మహేందర్,సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్ లు కోర్టులో 16 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడైన ఆనందం కి జీవిత ఖైదీతో పాటు1000/- రూపాయల జరిమానా విధించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని,నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన విచారణ అధికారి సీఐ వీరప్రసాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు,కోర్టు కానిస్టేబుల్ మహేందర్,సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్ లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మైనంపల్లి హనుమంతరావు

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
నేడు జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి వారి నివాసంలో కలిసిన మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సిద్దిపేట్ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరి కృష్ణ గార్లు.
అనంతరం మాట్లాడుతూ మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహరచనపై చర్చించారు. స్థానిక ఎన్నికల్లో మంచి విజయాలు సాధించాలని, మెదక్ జిల్లా పరిషత్ గెలవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.
జిల్లాలో ఇటీవల కురిసిన బారీ వర్షాల కారణంగా దెబ్బతిన రోడ్ల మరమ్మతులకు, కొత్త విద్యుత్ స్తంభాలకు మరియు విద్య,వైద్యం రంగాలపై జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కరారు.



మెదక్ జిల్లా రాజన్న జోన్లో ఉండడం వలన జిల్లా లోని విద్యార్థులు నిరుద్యోగులు ప్రభుత్వం చేపట్టే నియమకాలలో ఉద్యోగులు పదోన్నతులలో తీవ్రంగా నష్టపోతున్నారని వివరించగా. జిల్లా ప్రజల ఆకాంక్షల మేరకు మెదక్ జిల్లాను చార్మినార్ జోన్లో కలపడానికి సానుకూలంగా స్పందించారు.
పార్టీ పథకాలను గ్రామస్థాయిలో ప్రతి ఇంటికి చేరేలా చర్యలు,గ్రామ %-% పట్టణ స్థాయి కార్యకర్తలకు



శిక్షణ,బూత్ కమిటీల పునర్వ్యవస్థీకరణ,వంటి అంశాలపై చర్చించారు. జిల్లాలో పార్టీ ఐక్యతను పెంపొందించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.



## మాచనపల్లి గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని అధికారులు విచారణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 16**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మాచినపల్లి గ్రామానికి చెందిన పర్లపెల్లి ఎల్లయ్య భార్య రాజమ్మ ల కుమారుడు పర్లపెల్లి శంకర్ గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోవడం జరిగింది. శంకర్ భార్య సుశీల గత సంవత్సరం నుండి ఎల్లయ్య పోషణ



బాగోగులు చూడటం లేదని ఆర్డిఓ కి ఫిర్యాదు చేశారు. నెలకు 5000/- రూపాయలు పోషణ నిమిత్తం ఇవ్వాలని కోడలు సుశీల కి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని అధికారులు విచారణ చేపట్టారు. తన కోడలు సుశీల ఆర్డీవో ఆదేశాలు అనుసరించడం లేనందున అధికారులు, ఆర్డీవో ఆదేశాలు అనుసరించాలి అని, తెలియజేస్తూ వృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ ఐ. సత్యనారాయణ, డివిసి కౌన్సిలర్ పద్మావతి మహిళా సాధికారత కేంద్రం , జెండర్ స్పెషలిస్ట్ ఈ. శైలజ, పోలీస్ కానిస్టేబుల్స్ ఓ రవి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## అధికారిక భాషా విధానం అమలులో విశిష్ట కృషికి అవార్డు

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), సెప్టెంబర్ 16:**
భారత ప్రభుత్వ హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని అధికారిక భాషల విభాగం, 2024%-%25 సంవత్సరంలో కేంద్ర అధికారిక భాషా విధానాన్ని విజయవంతంగా అమలు చేయడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు రామగుండం ప్రాజెక్టు అధికారిక భాషా అమలు కమిటీని ప్రశంసనీయం విభాగంలో సత్కరించింది. రామగుండం ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత నాయకత్వంలో.. అధికారిక భాష హిందీ ప్రచారం, ప్రచారం, అమలులో కమిటీ గణనీయమైన పురోగతిని సాధించింది. హిందీ భాషను ప్రోత్సహించడంలో కమిటీ ప్రదర్శించిన అంకితభావం, నిబద్ధత మరియు సామర్థ్యం దేశవ్యాప్తంగా అధికారిక భాషా విధానం అమలుకు మద్దతు ఇవ్వడంలో ఇతర సంస్థలకు ప్రేరణగా నిలిచింది. ఈ అవార్డును ఎంజీఎం-హెచ్ఆర్ బిజొయ్ కుమార్ సిగ్దర్ అందుకున్నారు.

# ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు.

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ స్కూల్లో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై



మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉండడమే కాకుండా ఆ క్రీడ ద్వారా నైపుణ్యం పెంపొందించగలుగుతామని , విజయం పట్ల ఆసక్తిని పెంపొందిస్తామని చెప్పారు.
క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులచే విద్యార్థులకు ఇష్టమైన రంగంలో శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు.
కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించినటువంటి ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో పాఠశాల చెందినటువంటి జి .స్ఫూర్తి , డి.శ్రీహిత, 9వ తరగతి, అత్యుత్తమ ప్రతిభను కనబరచడమే కాకుండా త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు సైతం అవకాశాలను కైవసం చేసుకోవడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విజేతలకు పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ పీటీఎస్‌లో యువతి మృతి

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), సెప్టెంబర్ 16:**
ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని డి-టైపు క్వార్టర్‌లో యువతి నిద్రలోనే మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో ఉద్యోగం చేస్తున్న పాగిడి జయరాజు కుమార్తె అనూష(29) గత కొద్ది నెలలుగా మానసికంగా అనారోగ్యంతో ఉంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుమార్తె అనూష నిద్ర లేవకపోవడంతో ఆమెను నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా కదలికలు లేకపోవడంతో ఎన్టీపీసీ పీటీఎస్‌లోని ధన్వంతరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి జయరాజు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# కృష్ణా కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ కి వినతి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట :సెప్టెంబర్ 16**



జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణా కాలనీ ( 27వ వార్డ్ ) లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారించాలని కోరుతూ జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ కు సామాజిక కార్యకర్త,కృష్ణా కాలనీలో నివాసి గాజంగి వీరన్న వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ... జమ్మికుంటలోని కృష్ణా కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని,కాలనీ వాసులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.కనకయ్య మేస్త్రి ఇంటి ముందర ఉండే డ్రైనేజీ మీదగల కల్వర్టు డ్యామేజ్ అయిందని దీంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరుతుండటంతో కాలనీ వాసులకు సమస్యగా మారిందన్నారు.వర్షాలు పడుతుండటంతో విషజ్వరాలు ప్రబలే అసౌకర్యం లేకపోలేదని తెలిపారు.కాలనీలో వాహనదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొని కిందపడిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు.రోడ్డుకు ఓకే వేపు డ్రైనేజీ ఉండటంతోనే సమస్య తలెత్తుతుందని,కనకయ్య మేస్త్రి ఇంటి నుండి రెండు వైపులా కాలనీ లో కొత్త డ్రైనేజీ లను నిర్మించాలని,అలాగే కాలనీలో పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు.2021 సంవత్సరంలో పదవ నెలలో మిషన్ భగీరథ నీళ్ళను ఇవ్వడం జరిగిందని,కానీ నల్ల బిల్లు మాత్రం 2019 సంవత్సరం నుండి కట్టాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇట్టి సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో చందనాల జయ రాములు,కురిమిండ్ల కనకయ్య మేస్త్రి,మూల హరీష్,కురిమిండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ – అడ్మిషన్లకు 26 చివరి గడువు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ, ద్వితీయ. తృ తీయ సంవత్సరం 2025-26 విద్యాసంవత్సరానికి గాను బి.ఏ, బి.కామ్ అండ్ బి.ఎస్సి విద్యార్థులకు, ఏలాంటి అపరాధరుసుం లేకుండా అడ్మిషన్ ఫీజును (టూషన్ ఫీజు) సెప్టెంబర్ 26 లోగా చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా, అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ జి. సుబ్బారావు ఓక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ.ఓపెన్ -ఇంటర్మీడియట్, డిప్లొమా, 10o2 పాస్ అయిన వారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని వారు పేర్కొన్నారు. ఈ ఫీజు ను ఆన్ లైన్ - మీ.సేవా కేంద్రాలలో చెల్లించాలని వారు పేర్కొన్నారు. మరిన్ని వివారాల కోసం ఈ సెల్ నంబర్ 7382929655 లో సంప్రదించాలని వారు కోరారు.